సాక్షి
కరీంనగర్

శుక్రవారం । 23 । జూన్ । 2023

ఆటా..పాటా అదుర్స్













కరీంనగర్ తీగల వంతెన వద్ద గురువారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, క్రాకర్‌షో అలరించాయి. పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మానేరు తీరం కిటకిటలాడింది. చీఫ్‌గెస్ట్‌గా హాజరైన మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ మానేరు రివర్‌ఫ్రంట్ పనులు పూర్తయిన తర్వాత దేశమే కరీంనగర్‌వైపు చూస్తుందన్నారు. పనులు మూడు నెలల్లో పూర్తవుతాయని.. సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభించుకొని ఐదురోజుల పాటు ఉత్సవాలు చేసుకుందామన్నారు. హిందూముస్లింలు కలిసి ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎన్నికలు వేరు..రాజకీయాలు వేరన్నారు. మంత్రి కుటుంబ సభ్యులు, సీపీ సుబ్బారాయుడు, మేయర్ వై.సునీల్‌రావు, కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు. – కరీంనగర్



వీరులారా వందనం

రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మేయర్ వై.సునీల్‌రావు, 'సుడా' చైర్మన్ జీవీ రామకృష్ణారావు నివాళి అర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కార్పొరేటర్లు, బీఆర్‌ఎస్ లీడర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు. – కరీంనగర్

న్యూస్‌రీల్

నేడు ఒలింపిక్ డే రన్



ఏర్పాట్లు పరిశీలిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నేడు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించే 37వ ఒలింపిక్ డే రన్‌ను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం స్టేడియంలో రన్‌కు సంబంధించిన ఏర్పాట్లు పరిశీలించారు. ఉదయం మంత్రి గంగుల కమలాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభిస్తున్నట్లు వివరించారు. రన్ స్టేడియం నుంచి ప్రారంభమై ఆర్ట్స్ కళాశాలలోని జాతీయజెండా వరకు సాగుతుందని అన్నారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు, పీఈటీలు, పీడీలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఒలింపిక్ సంఘం ఉపాధ్యక్షుడు తుమ్మల రమేశ్‌రెడ్డి, పీఈటీలు, పీడీలు సమ్మయ్య, సురేశ్, రాజగోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి



జమ్మికుంట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ లలితాదేవి ఆదేశించారు. గురువారం వావిలాల పీహెచ్‌సీలో సమీక్ష నిర్వహించారు. గర్భిణులకోసం కేసీఆర్ న్యూట్రిషన్‌కిట్ అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు చేసుకుంటే పొందే లబ్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించినట్లు తెలిస్తే జీతాలు నిలిపివేస్తామని హెచ్చరించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని హెచ్చరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చందు, హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి సుపరింటెండెంట్ డాక్టర్ రమేశ్, పీహెచ్‌సీ డాక్టర్ సనజవేరియా, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సాజిద్, శంకర్‌రెడ్డి, పంజాల ప్రతాప్, రేష్మ, అశోక్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో అష్టావధానం



తిమ్మాపూర్: మండలంలోని ఎల్‌ఎండీకాలనీలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణాసంస్థలో జాతీయసేవా పథకం ఆధ్వర్యంలో జాతీయ సాహిత్య పరిషత్ సహకారం గురువారం అష్టావధానం ఏర్పాటు చేశారు. సాహితీవేత్త డాక్టర్ గంద్రె లక్ష్మణరావు అష్టావధానం చేశారు. డీఈవో జనార్దన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలుగు భాషలో అద్భుత ప్రక్రియ అవధానం అన్నారు. సభాధ్యక్షుడు, ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య మాట్లాడుతూ భాషలో ప్రావీణ్యం పొందితే అన్నింటిలో విజయం సాధించగలమన్నారు. సభా సమన్వయకర్తగా ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామకృష్ణ వ్యవహరించారు. అవధానులు రాజారామ్‌మోహన్, ప్రమోద్‌కుమార్, జీవీ.కృష్ణమూర్తి, సముద్రాల వేణుగోపాలచార్యులు, విఠల్ శర్మ, వీవీఎన్.స్వామి, కేఎస్.అనంతాచార్య, గోవర్ధన అముక్త మాల్యద పాల్గొన్నారు.

అమరుల ఆశయసాధనే లక్ష్యం

- వారి త్యాగాలు వెలకట్టలేనివి
- పదేళ్లల్లో రాష్ట్రంలో ఎనలేని అభివృద్ధి
- జెడ్పీ మీటింగ్‌లో మంత్రి గంగుల



కిష్టయ్య కుటుంబాన్ని సత్కరిస్తున్న కలెక్టర్



మాట్లాడుతున్న మంత్రి కమలాకర్, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, కలెక్టర్ కర్ణన్, తదితరులు

సాక్షిప్రతినిధి,కరీంనగర్: తెలంగాణ కోసం ప్రాణాలర్పించిన వారి త్యాగాలు వెలకట్టలేనివని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం జెడ్పీ చైర్ పర్సన్ కనుమల్ల విజయ అధ్యక్షతన జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి చీఫ్‌గెస్ట్‌గా హాజరయ్యారు. సమైక్య రాష్ట్రంలో తెలంగాణ దగాపడ్డదని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. గోదావరి నీటిని, బొగ్గు దోచుకున్నారని, గోదావరి, ఎన్టీపీసీ ప్లాంట్ ఉన్నా నీటికి, కరెంట్‌కు కటకటలు ఉండేవన్నారు. కరువు కాటకాలతో జనం బొంబాయి, దుబాయికి వలసలు వెళ్లారన్నారు. రాష్ట్రం సాధించుకున్నాక సీఎం కేసీఆర్ గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి తాగునీరు, సాగునీటికి ఇబ్బందులు దూరం చేశారన్నారు. జిల్లాపై ప్రత్యేక ప్రేమతో సీఎం కేసీఆర్ వేలకోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, ఐటీ టవర్, మెడికల్ కాలేజీలు, తిరుమల తిరుపతి దేవస్థానం కోసం ఫండ్స్ కేటాయింపులే దీనికి నిదర్శనమన్నారు. తొలిదశ ఉద్యమం 1969లోనే 300 మంది అమరులయ్యారని, మలిదశ ఉద్యమంలో 1200 మందికిపైగా అమరులయ్యారన్నారు. మలిదశ ఉద్యమంలో శ్రీకాంత్‌చారి, పోలీసు కిష్టయ్య, యాదిరెడ్డిలాంటి వారెందరో ప్రాణాలను అర్పించారని గుర్తుచేశారు. అమరుల కుటుంబాలను సీఎం కేసీఆర్ అక్కున చేర్చుకున్నారని, పోలీస్ కిష్టయ్య కుటుంబానికి అండగా నిలిచామన్నారు. ఆయన బిడ్డ ప్రస్తుతం డాక్టర్‌గా పనిచేస్తున్నారని తెలిపారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకునేందుకు చేసిన తీర్మానాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ సభలో ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదించారు. ఈ సందర్భంగా 31 మంది అమరుల కుటుంబ సభ్యులకు మంత్రి సన్మానించారు. అనంతరం జాతీయస్థాయిలో ఉత్తమ గ్రామపంచాయతీలుగా ఎంపికైన సర్పంచులు, కార్యదర్శులను అభినందించారు. ముందుగా అమరవీరుల జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మలిదశ ఉద్యమంలో 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' నినాదంతో ఆమరణ నిరహార దీక్షకు దిగడంతో తెలంగాణ సమాజం ఒక్కటైందన్నారు. స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో అందరూ మమేకమయ్యారన్నారు. రాష్ట్ర సాధన కోసం జరిగిన ఉద్యమంలో అమరులైన వారిలక్ష్య సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళన్నారు. కలెక్టర్ ఆర్వీ కర్ణన్ మాట్లాడుతూ అమరుల త్యాగంతోనే రాష్ట్రాన్ని సాధించుకున్నామని, వారి త్యాగఫలమే తెలంగాణ అభివృద్ధికి మూలమన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు, జెడ్పీ సీఈవో ప్రియాంక, జిల్లా అధికారులు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న సరోజన



సర్టిఫికెట్ అందుకుంటున్న రమేశ్

ఉత్తమ జీపీలకు సర్టిఫికెట్లు

కరీంనగర్/మానకొండూర్/రామగుడు/తిమ్మాపూర్: జిల్లాలోని ఆరు గ్రామపంచాయతీలకు ఐఎస్‌వో సంస్థ జారీచేసిన సర్టిఫికెట్లను గురువారం మంత్రి గంగుల కమలాకర్ జిల్లా పరిషత్ కార్యాలయంలో అందజేశారు. పచ్చదనం పరిశుభ్రత, గ్రామాల్లో చేపట్టే ప్రభుత్వ పథకాల అమలులో ముందువరుసలో ఉన్న పంచాయతీలకు ఐఎస్‌వో సంస్థ ధ్రువపత్రాలు జారీ చేసింది. జిల్లాలోని కరీంనగర్‌రూరల్ మండలం ఫకీర్‌పేట్, తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్, మహాత్మానగర్, తిమ్మాపూర్, రామడుగు మండలం వెలిచాల, గన్నేరువరం మండలం ఖాసీంపేట్ గ్రామపంచాయతీలకు ఐఎస్‌వో సంస్థ ధ్రువపత్రాలను జారీ చేయగా.. సర్పంచ్‌లు అందుకున్నారు.

పర్యటిస్తూ.. పలకరిస్తూ..



ఇంటింటికీ బీజేపీ ప్రచారంలో పాల్గొన్న ఎంపీ బండి సంజయ్

- మోదీ తొమ్మిదేళ్ల పాలనపై ఎంపీ బండి సంజయ్ ప్రచారం
- ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం సొంతవార్డు నుంచి ప్రారంభం

కరీంనగర్‌టౌన్: ప్రధాని మోదీ సంక్షేమపథకాలను ప్రతీగడపకు చేర్చాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని గురువారం ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ తను ప్రాతినిధ్యం వహించిన నగరంలోని చైతన్యపురి, జ్యోతినగర్ ప్రాంతమైన 57వ డివిజన్ నుంచి ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అందజేసి మోదీ పథకాలను ప్రచారం చేశారు. ఆప్యాయంగా పలకరిస్తూ ప్రజలతో మమేకమయ్యారు. డివిజన్‌లో సంజయ్ 122కుటుంబాలను కలిసి, మోదీ తొమ్మిదేళ్ల పాలనపై కరపత్రాలు స్వయంగా అందించారు. వారి ఇండ్లకు స్టిక్కర్లు అంటించారు. సంజయ్ మాట్లాడుతూ పోలింగ్‌బూత్ అధ్యక్షుడి నుంచి రాష్ట్ర అధ్యక్షుడి వరకు తాము నివాసం ఉండే పోలింగ్‌బూత్‌లకు వెళ్లి ప్రజలతో మమేకం అవుతుండటం సంతోషంగా ఉందన్నారు. ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం ద్వారా ఒక్కరోజే 35లక్షల కుటుంబాలను కలవాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా ఉన్న లారీ, ఆటో, ట్రాలీ, బస్ డ్రైవర్లందరినీ ఒకరోజు కలుస్తామని వివరించారు. వీరితోపాటు టీస్టాల్స్, హోటళ్లు, చిరు వ్యాపార నిర్వాహకులను కలవాలని నిర్ణయించామన్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే..

- గ్రాఫ్ పడిపోవడంతో 'బండి' అయోమయం
- రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్



మాట్లాడుతున్న రవీందర్‌సింగ్

కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ రోజుకో తీరు వివాదాస్పద వ్యాఖ్యలతో బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఒక్కటేనని రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక ఓ హోటల్‌లో మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు, అబద్ధపుప్రచారంతో పతాకశీర్షికల్లో ఉండాలనే ఎంపీ బండి సంజయ్ అత్యాశలతో ప్రజలు బీజేపీపై నమ్మకం కోల్పోతున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు విశ్వసించడం లేదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి మూడు సీట్లు కూడా రావని వెల్లడించారు. ఇంటింటికీ బీజేపీ ప్రచారానికి వెళ్లిన బండి సంజయ్‌కి ఎదురుదెబ్బలే తగులుతున్నాయని ఎద్దేవా చేశారు. ఎంపీగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కరీంనగర్‌కు ప్రత్యేకంగా నిధులు తీసుకవచ్చి చేసిన అభివృద్ధి ఏమిటో వెల్లడించాలని డిమాండ్ చేశారు. తెలంగాణపై విషం చిమ్ముతున్న ఎంపీ బండి సంజయ్ తమ తీరు మార్చుకోవాలని హితవు పలికారు. ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్ సారథ్యంలో బీఆర్‌ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని స్పష్టం చేశారు. నాయకులు గుంజపడుగు హరిప్రసాద్, కెంసారం తిరుపతి, దండబోయిన రాము, పెండ్యాల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

'దళితబంధు' బాగుంది

- గూగుల్ టీమ్ లీడర్ గౌరవ్ అగర్వాల్



టూరిస్టర్ షాపును పరిశీలిస్తున్న గూగుల్ బృందం

కరీంనగర్: దళితులు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధికి 'దళితబంధు' చక్కని మార్గమని గూగుల్ టీమ్ లీడర్ గౌరవ్ అగర్వాల్ అన్నారు. దళితబంధు పథకం ద్వారా కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన అమెరికన్ టూరిస్టర్ షాపును గురువారం బృందం సభ్యులు పరిశీలించారు. షాప్ నడిపిస్తున్న తీరు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా బృందం లీడర్ గౌరవ్ అగర్వాల్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు నాణ్యమైన వస్తువుల కొరకు ప్రాధాన్యం ఇస్తారని, దళితబంధు ద్వారా ఏర్పాటు చేసిన అమెరికన్ టూరిస్టర్ షాప్ నాణ్యమైన వస్తువులు అమ్మడం బాగుందన్నారు. లబ్ధిదారునికి అవసరమైన వ్యక్తిగత సహకారం గూగుల్‌టీం అందిస్తుందని తెలిపారు. ప్రజల అభిరుచులు అవసరాలకు అనుగుణంగా నగరంలో మల్టీ బ్రాండెడ్ షోరూం ఏర్పాటు చేసేందుకు అమెరికన్ టూరిస్టర్ షాప్ సభ్యులు ప్రణాళిక రూపొందిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా షాప్ అసిస్టెంట్ మేనేజర్, స్టోర్ ఇన్‌చార్జి మాట్లాడుతూ రాజరాజేశ్వర ఎస్టాబ్లిష్ అమెరికన్ టూరిస్టర్ తరఫున 2022 జూన్ 19న కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన షాపు ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం గూగుల్ టీం కలెక్టర్ ఆర్వీ కర్ణన్, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాసును కలిసింది. కార్యక్రమంలో బెంగళూర్, హైదరాబాద్‌కు చెందిన సభ్యులు ఇషాన్ దేశ్ పాండే, నిహారిక రెడ్డి, దినేశ్ తివారి తదితరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ చదివి.. ఐపీఎస్‌గా ఎదిగి

- రెండో ప్రయత్నంలో విజయం
- సీనియర్ల సలహాతో సివిల్స్ వైపు పయనం
- ట్రైనీ ఐపీఎస్‌గా శిక్షణ పొందుతున్న మహేశ్ గీతే
- మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచన

చొప్పదండి: ఆయన వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగారు. అగ్రికల్చర్ బీఎస్సీ చదివారు. గ్రాడ్యుయేషన్ చదువుతున్న సమయంలో సీనియర్లు ఇచ్చిన సలహాతో సివిల్ సర్వీసెస్ వైపు దృష్టి సారించారు. ఎటువంటి కోచింగ్ లేకుండా నిరంతర సాధన చేశారు. రెండో ప్రయత్నంలో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. ప్రస్తుతం చొప్పదండి ఠాణాలో శిక్షణ ఐపీఎస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనే మహారాష్ట్రకు చెందిన మహేశ్ బీ. గీతే.

వ్యవసాయ కుటుంబం నుంచి

మహారాష్ట్రలోని అహ్మద్‌నగర్‌కు చెందిన బాబా సాహెబ్, సోజల్ దంపతుల రెండో సంతానం మహేశ్ బి.గీతే. పూర్తిగా వ్యవసాయ కుటుంబనేపథ్యంలోనే పెరిగారు. వ్యవసాయంలో తల్లిదండ్రుల కష్టాలను చూసి అగ్రికల్చర్ బీఎస్సీ చదువేందుకు పూణే వెళ్లారు. అక్కడ తనకు పరిచయమైన సీనియర్ బీఎస్సీ విద్యార్థులు ఇచ్చిన సూచనతో సివిల్ సర్వీసెస్‌పై మక్కువ పెంచుకున్నారు. డిగ్రీ పూర్తి కాగానే 2020లో సివిల్ సర్వీసెస్ పరీక్షకు హాజరయ్యారు. మొదటి ప్రయత్నంలో లక్ష్యం చేరకపోవడంతో రెండోసారి ప్రయత్నించారు. ఎటువంటి ప్రత్యేక కోచింగ్‌లు తీసుకోకుండా రెండో ప్రయత్నంలో ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. 2021 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ప్రస్తుతం చొప్పదండి పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి. మండలంలో ఓపెన్ డ్రింకింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్, ఈవ్ టీజింగ్ నియంత్రణపై దృష్టి సారిస్తాం. ఎస్సీ,ఎస్టీ కేసులపై అవేర్‌నెస్ పెంచుతాం. భూమి తగాదా సమస్యలు ఎక్కువగా వస్తున్నాయి. అధికారుల సహకారంతో సమస్యలు పరిష్కరిస్తాం. మూడు నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహిస్తానని మహేశ్ బీ. గీతే. వివరించారు.



మాట్లాడుతున్న ట్రైనీ ఐపీఎస్ మహేశ్ గీతే

క్లుప్తంగా

విద్యా వ్యాపారాన్ని అరికట్టాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ అమ్ముతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం డీఈవో సూపరింటెండెంట్ నర్సింహస్వామికి వినతిపత్రం ఇచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్ మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలలో విచ్చలవిడిగా ఫీజులు పెంచుతూ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అమ్ముతూ, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని ఆరోపించారు.జిల్లా ఉపాధ్యక్షుడు కనకం సాగర్, వినయ్, సాయి పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలకు ఒగ్గు కళాకారులు



బయల్దేరుతున్న ఒగ్గుకళాకారులు

కరీంనగర్‌రూరల్:రాష్ట్ర ప్రభుత్వం గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లా నుంచి 200 మంది కళాకారులు బస్సుల్లో తరలివెళ్లారు. కరీంనగర్ మండలం నగునూరులో సాయిల్ల సింగారయ్య,శివయ్య, మల్లేశం, ఎంపీటీసీ వినయ్‌సాగర్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఒగ్గు కళాకారులు పాల్గొన్నారు. జిల్లా కళాకారులు ప్రదర్శించిన ఒగ్గు కళారూపాలకు స్పందన వచ్చిందని వినయ్ తెలిపారు.

ఉచిత శిక్షణ

విద్యానగర్: యూపీపీఎస్సీ, సీఎస్ఏటీ–2024 పరీక్షకు రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ, స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి మధుసూధన్ తెలిపారు. మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, వికలాంగులకు 5శాతం సీట్ల కేటాయించినట్లు తెలిపారు. పరీక్షకు ఈనెల 26 నుంచి జూలై 13లోగా సంబంధిత వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలని, స్క్రీనింగ్ పరీక్ష జూలై 23న జరుగుతుందని వివరించారు. వివరాలకు 98491 52516కు సంప్రదించాలని అన్నారు.

కార్యదర్శిపై దాడి.. కేసు నమోదు

మానకొండూర్: మండలంలోని ఊటూరు గ్రామ జూనియర్ పంచాయతీ కార్యదర్శి కె.దేవేందర్‌పై అదే గ్రామానికి చెందిన కొయ్యెడ శ్రీనాథ్ దాడి చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సీఐ రాజ్‌కుమార్ వివరాల మేరకు.. ఊటూరు గ్రామ కార్యదర్శిగా దేవేందర్ కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం గ్రామంలోని నర్సరీ వద్ద కార్యదర్శి దేవేందర్ ఉండగా, ఇదే గ్రామానికి చెందిన కొయ్యెడ శ్రీనాథ్ వచ్చి తన నాన్నమ్మకు ఎస్‌వోసీ సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చావని కార్యదర్శిపై దాడి చేశాడు. శ్రీనాథ్ తన విధులకు ఆటంకం కలిగించాడని, దాడిచేశాడని దేవేందర్ ఫిర్యాదుచేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

25న బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 25న స్థానిక విద్యుత్‌శాఖ బాస్కెట్‌బాల్ కోర్టులో జిల్లాస్థాయి జూనియర్స్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి బి అనంతరెడ్డి తెలిపారు. జిల్లాస్థాయిలో రాణించినవారిని 28నుంచి జూలై 1వరకు జరిగే 7వ రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. 2005 జనవరి తరువాత జన్మించినవారు అర్హులని, ఆసక్తి గలవారు మధ్యాహ్నం 3 గంటలకు రిపోర్టు చేయాలన్నారు.

'పొన్నం' కార్పొరేటర్‌గా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా

- నగర మేయర్ సునీల్‌రావు సవాల్

కరీంనగర్ కార్పొరేషన్: మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ కార్పొరేటర్‌గా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మేయర్ యాదగిరి సునీల్‌రావు స్పష్టంచేశారు. ప్రభాకర్ నివాసముండే 36వ డివిజన్ కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ స్వచ్ఛందంగా రాజీనామా చేస్తారని, ఆమెపై పోటీచేసి గెలవాలని సవాల్ విసిరారు. గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో మీడియాతో మాట్లాడారు. మంత్రి గంగుల కమలాకర్, ప్రణాళికబోర్డు వైస్ చైర్మన్ వినోద్‌కుమార్‌పై ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. బాడీ లాంగ్వేజ్‌పై మాట్లాడుతున్నారని, భాష మార్చుకోవాలని హెచ్చరించారు. ఓటమెరుగని గంగుల కమలాకర్, మూడుసార్లు ఎంపీగా గెలిచిన వినోద్‌పై మాట్లాడే నైతిక అర్హత పొన్నంకు లేదని మండిపడ్డారు. పొరపాటునో, గ్రహపాటునో పొన్నం ఒకసారి ఎంపీగా గెలిచాడని చెప్పారు. కాంగ్రెస్ పార్టీలో 150 మందికి పీసీసీలో పదవులుంటే, ప్రభాకర్‌కు అందులో అవకాశం లేదన్నారు. కరీంనగర్‌లో కాంగ్రెస్‌పార్టీని భూస్థాపితం చేసింది ప్రభాకరేనని, ఇది కాంగ్రెస్ పార్టీ నాయకులే చెబుతున్నారన్నారు. డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్, కార్పొరేటర్లు గందె మాధవి, గంట కల్యాణి, ఎడ్ల సరిత, బండారి వేణు, వాల రమణారావు, చాడగొండ బుచ్చిరెడ్డి, నాంపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మేయర్, మహిళా కార్పొరేటర్లు, బీఆర్ఎస్ లీడర్లు

ప్రభాకర్..పనికిరాని వ్యక్తి

కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సమాజానికి పనికిరాని వ్యక్తని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని ఆర్‌ఆర్‌ఆర్ సెంటర్ ఎదుట మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి హరిశంకర్, బీఆర్ఎస్ నాయకుడు ఎడ్ల అశోక్‌ల ఆధ్వర్యంలో వినూతన్న ప్రదర్శన నిర్వహించారు. తుప్పుపట్టిన రేకు డబ్బాలకు పొన్నం ప్రభాకర్ చిత్రపటాన్ని అతికించి, పనికిరాని పాత వస్తువు లాంటివాడని, ఆయన సమాజానికి తుప్పు లాంటి వాడంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తీగల వంతెన, ఐటీ టవర్, మెడికల్ కళాశాల, మానేరు రివర్ ఫ్రంట్, ఐలాండ్స్, స్మార్ట్ సిటీ రోడ్లు, హైమాస్ట్ వెలుగులు, జిలుగులు చూసి పొన్నం ప్రభాకర్ అసూయతో రగిలిపోతున్నాడన్నారు. కార్పొరేటర్లు గందె మాధవి, ఎడ్ల సరిత, అర్షకిరణ్మయి,నక్కపద్మ, కోల మాలతి, వాల రమణారావు, బోనాల శ్రీకాంత్, బండారి వేణు, తోట రాములు, తదితరులున్నారు.

అమరుల కుటుంబాలకు అండగా..



మేయర్‌ను ఆశీర్వదిస్తున్న మంత్రి గంగుల

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణకోసం ఆత్మహుతి చేసుకున్న అమరుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని బీసీ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. గురువారం మేయర్ సునీల్‌రావు అధ్యక్షతన నిర్వహించిన నగరపాలక సంస్థ ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. సునీల్‌రావును మేయర్ సీటులో ఆసీనులు చేసి మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ ఏజెండా తీర్మానం ప్రవేశపెట్టారు. ప్రభుత్వ సహకారంతో పోలీసు కిష్టయ్య కూతురు డాక్టర్ అయ్యిందని తెలిపారు. రాష్ట్రం వచ్చాకే నగరం అభివృద్ధి చెందుతున్నారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లో మంత్రి సందడి..

తాను రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన మున్సిపల్ కార్పొరేషన్‌లో మంత్రి గంగుల కమలాకర్ సందడి చేశారు. దాదాపు రెండున్నర గంటల పాటు కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బందితో సరదాగా గడిపారు. మేయర్, డిప్యూటీ మేయర్ చాంబర్లలో కూర్చొని కార్పొరేటర్లు, అధికారులతో చిట్‌చాట్ చేశారు. తక్కువ టైంలో కార్యాలయాన్ని ఆధునీకరించడంలో సహకరించిన ఎస్ఈ నాగమల్లేశ్వర్ రావు, ఈఈలు కిష్టయ్య, మహేందర్, డీఈ మసూద్ అలీ, ఏఈలు నిఖిత, చైతన్య, కాంట్రాక్టర్లు హరికృష్ణ, సలాఉద్దీన్‌ను సన్మానించారు. తాను కార్పొరేటర్‌గా ఉన్నసమయం నుంచి విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి రఫీబ్‌ను ఆప్యాయంగా పలకరించి ఫొటో దిగారు.

ఆగస్టు 15లోగా వాటర్ ఫౌంటెన్ పూర్తి చేయాలి

కరీంనగర్: మానేర్ రివర్ ఫ్రంట్‌లో భాగంగా చేపడుతున్న వాటర్ ఫౌంటేన్ పనులను ఆగస్టు 15లోగా పూర్తిచేయాలని మంత్రి గంగుల కమలాకర్ ఆదేశించారు. కలెక్టర్ క్యాంప్ ఆఫీస్‌లో ఇరిగేషన్, టూరిజం, వాటర్ ఫౌంటేన్ నిర్మాణ ఏజెన్సీతో మంత్రి రివ్యూ నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ఇరిగేషన్ ఈఈ నాగభూషణం, టూరిజం కార్పొరేషన్ ఏఈ జీవన్‌రెడ్డి, ముఖ్యప్రణాళిక అధికారి కొమురయ్య, ఏజెన్సీ ఇంజినీర్ అఖిలేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్‌టౌన్: టీ–డయాగ్నోస్టిక్స్ కరీంనగర్‌లో ఒక సంవత్సరం కాంట్రాక్ట్ పద్ధతిన నియమాకానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎల్.కృష్ణప్రసాద్ తెలిపారు. రేడియోలజిస్ట్(1), మైక్రోబయాలజిస్ట్(1) పోస్టులు ఉన్నాయని రేడియాలోజీ/ మైక్రోబయాలజీలో ఎండీ డిగ్రీ ఉండాలని, ఫార్మసిస్ట్(1) అర్హత బి–ఫార్మసీ లేదా డీ–ఫార్మసీ, డేటా ఎంట్రీ ఆపరేటర్(1) కంప్యూటర్ ప్రొఫెసెన్సితో పాటు డిగ్రీ, సానిటేషన్ హెల్పర్/ సపోర్టింగ్ స్టాఫ్(1) అర్హత ఏడోతరగతి ఉండాలని, తగుధ్రువపత్రాలతో దరఖాస్తులను జిల్లా ఆస్పత్రిలో 27వ తేదీలోపు సమర్పించాలని సూచించారు.

ఇద్దరికి డీఎస్పీలుగా పదోన్నతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్ సీపీటీసీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న మాధవి, కరీంనగర్ ఇంటెలిజెన్స్ సీఐగా పనిచేస్తున్న సదానందంకు డీఎస్పీగా పదోన్నతి లభించినట్లు సమాచారం. రాష్ట్రవ్యాప్తంగా 141మంది సీఐలకు డీఎస్పీలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఈవీఎంలు రెడీ చేయండి

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల కోసం ఈవీఎంలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఈవీఎం గోడౌన్‌లో జరుగుతున్న ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను వివిధ పార్టీల నేతలతో కలిసి తనిఖీ చేశారు. అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్, ట్రైనీ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో, కలెక్టరేట్ ఏవో జగత్‌సింగ్, ఎన్‌టీ ఎలక్షన్స్ తహసీన్, వివిధ రాజకీయ పార్టీల లీడర్లు సత్తినేని శ్రీనివాస్, మోహన్, నాంపల్లి శ్రీనివాస్, అనిల్‌కుమార్, అమీన్, కల్యాడపు ఆగయ్య పాల్గొన్నారు.

ఇన్నోవేషన్ చాలెంజ్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ ఇన్నోవేషన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్, ఇంక్విలాబ్ ఫౌండేషన్, యూనిసెఫ్ నిర్వహించిన ఈ పోటీకి 17,884 విద్యార్థి బృందాలు 13,670 ఆలోచనలు పంపాయి. ఈనెల 20,21వ తేదీన హైదరాబాద్‌లోని బూట్‌క్యాంప్ ఆచార్య జయశంకర్ యూనివర్సిటీలో జరిగిన గ్రాండ్ ఫినాలేకు 70 బృందాలను ఎంపిక చేశారు. కరీంనగర్ జిల్లానుంచి నాలుగుబృందాలు గ్రాండ్‌ఫినాలేలో పాల్గొన్నాయి. జిల్లా విద్యార్థులు జి.సాయివర్ధన్, ఎండీ.ఆదిల్, ఎండీ.ఫయాజ్‌పాషా, ఎండీ.ఉజర్ తయారుచేసిన మల్టీపర్పస్ క్లీనింగ్ మిషన్ రాష్ట్రస్థాయిలో ఆరోస్థానాన్ని స్థానాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఐటీఅండ్‌ఇండస్ట్రీస్ మీదుగా విద్యార్థులు, గైడ్ టీచర్ తిరుపతి ట్యాబ్‌లు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. విద్యార్థులను డీఈవో సీహెచ్‌వీఎస్.జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి చాడ జైపాల్‌రెడ్డి, డీసీఈబీ సెక్రెటరీ సతీశ్‌కుమార్, చిల్డ్రన్‌సైన్స్ కాంగ్రెస్ అకాడమిక్ కో–ఆర్డినేటర్ అనంతచార్య అభినందించారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

- బాత్రూం నిర్మాణ పనులు చేస్తుండగా తగిలిన 11కేవీ తీగ
- అక్కడికక్కడే మృతిచెందిన యువకుడు
- బాధిత కుటుంబానికి బండి సంజయ్‌కుమార్ పరామర్శ



పరామర్శిస్తున్న ఎంపీ సంజయ్ కుమార్

రామడుగు: ఒక్కగానొక్క కొడుకు. చేతికి అందవచ్చాడు. కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆసరాగా ఉంటాడని అనుకున్నారు. ఇంతలో విద్యుత్ ప్రమాదం ఆ యువకుడిని కానరాని లోకానికి చేర్చింది. స్థానికుల వివరాల మేరకు.. రామడుగు మండలం వెదిర గ్రామానికి చెందిన వంచ వీరారెడ్డి కూరగాయలు అమ్ముతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇతడికి భార్య, కూతురు, కొడుకు శ్రీకాంత్‌రెడ్డి(24) ఉన్నారు. శ్రీకాంత్‌రెడ్డి డిగ్రీ పూర్తిచేశాడు. ప్రస్తుతం బీజేపీలో సోషల్‌మీడియా వింగ్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాడు. ఇంటివద్ద ఇటీవల బాత్రూం నిర్మాణం చేపట్టారు. అది 11కేవీ విద్యుత్ లైన్‌కింద ఉంది. నిర్మాణ పనుల్లో భాగంగా గురువారం మధ్యాహ్నం శ్రీకాంత్‌రెడ్డి దానిపైకి ఎక్కి, కూర్చుని పనులు చేస్తున్నాడు. పనులు ముగించుకుని ఒక్కసారిగా పైకి లేవగా పైనఉన్న 11కేవీ విద్యుత్ తీగ మెడకు తగిలింది. విద్యుత్‌షాక్‌తో కిందపడి అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న రామడుగు పోలీసులు మృతదేహాన్ని కరీంనగర్ జిల్లా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. తండ్రి వీరారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకాంత్‌రెడ్డి మరణవార్త తెలుసుకున్న కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ వెదిర గ్రామానికి వచ్చాడు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. ఆయన వెంట పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, తదితరులు ఉన్నారు.



శ్రీకాంత్‌రెడ్డి(ఫైల్)

ఆచంపల్లిలో ఒకరు..



గణేశ్ మృతదేహం

గంగాధర: మండలంలోని ఆచంపల్లి గ్రామానికి చెందిన బోగోజు గణేశ్(30)విద్యుత్‌షాక్‌తో మరణించాడు. ఎస్సై అభిలాష్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గణేశ్ తన తండ్రి రవీందర్‌తో కలిసి పెద్ద ఆచంపల్లి గ్రామంలో రేకులషెడ్డు నిర్మాణ పనులకు వెళ్తున్నాడు. గురువారం సైతం ఇద్దరూ పనికి వెళ్లారు. షెడ్డుపై రేకులు వేస్తున్న క్రమంలో డ్రిల్లింగ్ మిషన్ వైరు లూజ్ కనెక్షన్‌తో గణేశ్‌కు విద్యుత్‌షాక్ తగిలి కిందపడిపోయాడు. రవీందర్, స్థానికులు కలిసి గణేశ్‌ను కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు తెలిపారు. మృతుడి భార్య సంధ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

అల్ఫోర్స్ నీట్ ర్యాంకర్లకు సన్మానం



నీట్ ర్యాంకర్లను సన్మానించిన అధికారులు

కొత్తపల్లి: నీట్–2023లో ర్యాంకులు సాధించిన అల్ఫోర్స్ విద్యార్థులకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో కళాశాలలో ఘన సన్మానం చేశారు. ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ హెడ్ ఆత్మారామ్ హాజరయ్యారు. అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నీట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో అత్యుత్తమ డాక్టర్లుగా సమాజానికి సేవలు అందించాలని అన్నారు. చీఫ్ మేనేజర్ వి.మారుతి, తదితరులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో బోనాల ఉత్సవాలు

కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో బోనాలకు ప్రత్యేకత ఉందని, ఉత్సవాలను వర్షాలుసకాలంలో కురువాలని నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

'వాగేశ్వరి'లో నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిమ్మాపూర్: తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఎసెంట్రా–2కే23 పేరుతో నేషనల్ లెవల్ టెక్నికల్ సింపోజియం గురువారం ప్రారంభమైంది. రెండు రోజులు ఈ కార్యక్రమం జరుగుతుంది. మొదటి రోజు ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ టి.వెంకటేశ్ హాజరై మాట్లాడారు. వీఎల్ఎస్ఐ చిప్స్, టెలికమ్యూనికేషన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ రంగాలలో పరిజ్ఞానాన్ని, విశేష అవకాశాలను వివరించారు. కళాశాల జనరల్ సెక్రటరీ బి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి సదస్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తయారుచేసిన వివిధ రకాల ప్రాజెక్టులు, పోస్టర్ ప్రజెంటేషన్లలో ప్రతిభ కనబరిచారని కళాశాల జాయింట్ సెక్రెటరీ డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొదటి రోజు టెక్నికల్ ఈవెంట్స్ లో భాగంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పీసీటీ ప్రజంటేషన్, టెక్నికల్ క్విజ్ నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి సుమారుగా 400మంది విద్యార్థులు హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డా.సీహెచ్ శ్రీనివాస్, డైరెక్టర్ వినోద్, ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిరసనలో ఉద్రిక్తత

- పోలీసులు.. కాంగ్రెస్ శ్రేణుల మధ్య తోపులాట
- డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అరెస్టు



కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, నాయకులు

శంకరపట్నం: శంకరపట్నం మండలం కేశవపట్నంలో గురువారం కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన దశాబ్ది దగా నిరసన కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు కరీంనగర్–వరంగల్ జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగారు. అంబేద్కర్‌చౌరస్తాలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ క్రమంలో హుజూరాబాద్ రూరల్ సీఐ సంతోశ్, ఎస్సైలు చంద్రశేఖర్, ఆరోగ్యం ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణను అరెస్టు చేసి పోలీసువాహనం ఎక్కించారు. వాహనం ముందుకు వెళ్లకుండా కాంగ్రెస్ నేతలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు.. కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట జరిగింది. అతికష్టం మీద కవ్వంపల్లిని పోలీసుస్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ నాయకులు ర్యాలీగా పోలీస్‌స్టేషన్ సమీపానికి వెళ్లగా.. పోలీసులు స్టేషన్ గేటువేసి, పోలీసువాహనం అడ్డం పెట్టారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్ సీఐ, ఎస్సైతో వాగ్వాదానికి దిగారు. డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణతోపాటు 24మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, సొంతపూచికత్తుపై విడుదల చేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. దశాబ్ది ఉత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. మాజీ జెడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, శంకరపట్నం, మానకొండూర్, తిమ్మాపూర్, బెజ్జంకి మండలాల అధ్యక్షుడు బస్వయ్య, రవీంద్రాచారి, రమణారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కవ్వంపల్లిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ఓటమి భయంతోనే ఉత్సవాలు

హుజూరాబాద్: ఓటమిభయంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బల్మూరి వెంకట్ అన్నారు. దశాబ్ది ఉత్సవాలకు నిరసనగా గురువారం హుజూరాబాద్ అంబేద్కర్‌చౌరస్తా వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ కేసీఆర్ నాయకత్వంలో ఏం అభివృద్ధి చేసిందని ప్రశ్నించారు. టీపీసీసీ సభ్యులు కర్ర భగవాన్‌రెడ్డి, నాయకులు కొల్లూరు కిరణ్, సొల్లుబాబు, చరణ్ పటేల్, శ్యాంసుందర్‌రెడ్డి, రామారావు, రాజేశ్వరావు, వెంకన్న, ఐలయ్య, సుశీల పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్న పోలీసులు

అంబేద్కర్ చౌరస్తా వద్దకు వెంకట్ ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించారు. ఇదే సమయంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద అమరవీరుల స్తూపం ఆవిష్కరణ జరుగుతోంది. ఎలాంటి గొడవలు జరగకుండా పోలీసులు కాంగ్రెస్ నాయకులను అడ్డుకున్నారు. కాంగ్రెస్ నాయకులు రోడ్డుపై బైఠాయించి వ్యతిరేకం గానినాదాలు చేశారు. దీంతో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

ఇల్లందకుంట: వ్యవసాయ బావిలోదూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఇల్లందకుంట మండలం మల్లివానిపల్లి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మల్లివానిపల్లి గ్రామానికి చెందిన కళ్లెం వీరారెడ్డి(85) వ్యవసాయం చేస్తుంటాడు. కొన్నాళ్లుగా మతిస్థిమితం కోల్పోతున్నాడు. రెండురోజుల క్రితం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం తన చిన్నకుమారుడికి చెందిన వ్యవసాయ బావి ఒడ్డున చెప్పులు ఉండడంతో అందులోకి చూడగా.. శవమై కనిపించాడు. ఎస్సై తోట తిరుపతి మృతదేహాన్ని బయటకు తీసి పంచనామా నిర్వహించి, పోస్టుమార్టానికి తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరి రిమాండ్

తిమ్మాపూర్: మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిని ఎల్ఎండీ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పర్లపల్లి గ్రామానికి చెందిన మహిళ ఈనెల 18న ఉదయం నడుచుకుంటూ వెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన కీసర సురేశ్ ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధితురాలు విషయాన్ని ఇంట్లో చెప్పింది. వారు ఎల్ఎండీ ఠాణాలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం సురేశ్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

విద్యానగర్(కరీంనగర్): యువత వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అదనపు పాలనాధికారి జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ అన్నారు. గురువారం రెవెన్యూ గార్డెన్స్‌లో ఏజేఆర్ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యాంప్రసాద్‌లాల్ మాట్లాడుతూ.. యువత తమ నైపుణ్యాన్ని పెంచుకుని, ఆయా రంగాల్లో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. ఏజేఆర్ నేతాజీ ఫౌండేషన్ చైర్మన్ అంబటి జోజిరెడ్డి మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్, మార్కెటింగ్ రంగాలకు చెందిన 31 కంపెనీలతో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని తెలిపారు.

పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

కరీంనగర్‌టౌన్: తెలంగాణ పోరాటయోధుడు, మాజీ పార్లమెంట్ సభ్యుడు పొన్నం ప్రభాకర్‌పై బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్రసత్య ప్రసన్నరెడ్డి ఆధ్వర్యంలో పొన్నం ప్రభాకర్ చిత్రపటానికి తెలంగాణ చౌక్‌లో క్షీరాభిషేకం చేశారు. సత్యప్రసన్నరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ కోసం సొంత పార్టీ నేతలను ఎదిరించిన వ్యక్తి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్‌కు కేంద్రీయవిద్యాలయం, పాస్‌పోర్టు ఆఫీస్, తిరుపతికి రైలు, ఎఫ్ఎంరేడియో లాంటివి ఎన్నో తీసుకువచ్చారని గుర్తుచేశారు. ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, పడాలరాహుల్, ఎండీ.తాజ్, పులి ఆంజనేయులుగౌడ్, మేనేని రోహిత్‌రావు, కొరివి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

మరణించినా.. ఆయన చూపు సజీవం



రవీంద్రాచారి(ఫైల్)

కరీంనగర్‌టౌన్: మరణించినా ఆయన కళ్లు బతికే ఉన్నాయి. నేత్రదానంతో మరో ఇద్దరికి వెలుగు ప్రసాదించాయి. కరీంనగర్‌లోని హనుమాన్‌నగర్‌కు చెందిన బెజ్జంకి రవీంద్రచారి(33) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. అంతదుఃఖంలోనూ సమాజహితం కోసం రవీంద్రచారి నేత్రాలు దానంచేయడానికి ముందుకు రావాలని కుటుంబసభ్యులకు, మృతుడి మిత్రులు అవగాహన కల్పించారు. ఆయన భార్య లావణ్య, తల్లిదండ్రులు రామస్వామి, సరోజన ఒప్పుకున్నారు. టెక్నీషియన్ సతీష్ ద్వారా సేకరించిన నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకుకు తరలించారు. రవీంద్రచారికి ఘనంగా నివాళి అర్పించారు. ఆయన కుటుంబసభ్యులను సదాశయఫౌండేషన్ ప్రతినిధులు అభినందించారు.